
సాక్షి
బాపట్ల
శుక్రవారం । 19 । ఏప్రిల్ । 2024



షార్ట్ ఫిల్మ్ సీడీ ఆవిష్కరణ

తెనాలిఅర్బన్: ఓటు వినియోగంపై అవగాహన కల్పించేందుకు తెనాలి సబ్‌కలెక్టర్ ప్రఖర్ జైన్ ఆధ్వర్యంలో రూపొందించిన బ్యాలెట్ షార్ట్ ఫిల్మ్ సీడీని బుధవారం రాత్రి ఆవిష్కరించారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం గురువారం 508.20 అడుగుల వద్ద ఉంది. సాగర్ జలాశయం నుంచి కుడి కాలువకు 5,496 క్యూసెక్కులు వదిలారు.



శ్రీరాముడి పట్టాభిషేకం

నాదెండ్ల: శ్రీరామనవమి వేడుకలను పురస్కరించుకుని గణపవరంలో గురువారం శ్రీరాముని పట్టాభిషేకం కనుల పండువలా నిర్వహించారు.

న్యూస్‌రీల్

కలెక్టరేట్‌లో వ్యయ విభాగాల పరిశీలన



నరసరావుపేట: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా నరసరావుపేట పార్లమెంటు నియోజకవర్గానికి వ్యయ పరిశీలకులుగా నియమించబడిన సుమీత్ కుమార్, అసెంబ్లీ నియోజకవర్గాలకు నియమించబడిన గౌతమన్ గురువారం కలెక్టర్ కార్యాలయంలో జిల్లా ఎన్నికల అధికారి ఎల్.శివశంకర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఎన్నికల వ్యయ పరిశీలకుల విభాగం, కమాండ్ కంట్రోల్ సెంటర్, మీడియా సెంటర్‌ను తనిఖీ చేశారు. పలు రికార్డుల్ని పరిశీలించారు. అనంతరం కమాండ్ కంట్రోల్ రూం సిబ్బందికి, వ్యయ పరిశీలక విభాగ సిబ్బందికి పలు సూచనలు, సలహాలు అందజేశారు.

యార్డులో 88,176 బస్తాల మిర్చి

కొరిటెపాడు (గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు గురువారం 88,176 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 83,908 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల సగటు ధర రూ.8,000 నుంచి రూ. 17,500 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల సగటు ధర రూ.8,000 నుంచి 19,300 వరకు లభించింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.11,000 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 68,946 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు ఇన్‌చార్జి కార్యదర్శి కాకుమాను శ్రీనివాసరావు తెలిపారు.

హనుమజ్జయంతి ఏర్పాట్లకు శ్రీకారం



హనుమాన్ జంక్షన్ రూరల్: కృష్ణాజిల్లా హనుమాన్ జంక్షన్‌లోని ప్రసిద్ధ అభయాంజనేయ స్వామి దేవస్థానంలో ఏటా వైభవంగా నిర్వహించే హనుమజ్జయంతి ఉత్సవాల ఏర్పాట్లకు గురువారం శ్రీకారం చుట్టారు. ఉత్సవాల ఏర్పాట్లను దేవస్థానం ప్రాంగణంలో రాటా ఉత్సవంతో ప్రారంభించారు. ఆలయ ప్రధాన అర్చకుడు మారేపల్లి సీతారామానుజాచార్యులు, అర్చకుడు శృంగారం వెంకట శేషారామానుజాచార్యులు పూజా కార్యక్రమాలు నిర్వహించి ఉత్సవ పందిరి ఏర్పాటుకు రాటా కర్రను ప్రతిష్ఠించారు. హనుమజ్జయంతి ఉత్సవాలను మే 27వ తేదీ నుంచి జూన్ 1వ తేదీ వరకు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి కూచిపూడి శ్రీనివాస్ తెలిపారు. దెందులూరు ఏఎంసీ చైర్మన్ అప్పక కనకదుర్గాప్రసాద్, ఆలయ పాలకమండలి మాజీ చైర్మన్లు నెరుసు భూషణం, కొండేటి కనకదుర్గారావు, పుర ప్రముఖులు సుంకర సుభాష్‌చంద్రబోస్, నందూరు సత్య వెంకటేశ్వర శర్మ, మేడేపూడి రామ్మోహనరావు, తాడి రంగారావు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి రూ.10 లక్షల విరాళం



మోపిదేవి: ప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న కృష్ణాజిల్లా మోపిదేవిలోని శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారి దేవస్థానంలో నిర్వహించే నిత్యాన్నదానానికి విజయవాడకు చెందిన కేతినేని రత్నాకరరావు, లక్ష్మీ శమంతకమణి దంపతులు రూ.10 లక్షలు విరాళంగా సమర్పించారు. గురువారం ఉదయం స్వామివార్లను దర్శించుకున్న అనంతరం శాశ్వత నిత్యాన్నదాన పథకం కింద ఈ విరాళాన్ని ఆలయ ఏసీ ఎన్ఎస్ చక్రధరరావుకు అందజేశారు. ఈ సందర్భంగా దాతలకు స్వామివారి చిత్రపటం, లడ్డూ ప్రసాదాలు అందించి ఆలయ మర్యాదలతో సత్కరించారు. దాత కుటుంబ సభ్యులు, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

నిమ్మకాయల ధరలు

తెనాలి: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్ యార్డులో గురువారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.4,500, గరిష్ట ధర రూ.6,400, మోడల్ ధర రూ.5,500 వరకు పలికింది.

తీరంలో హ్యాపీ డేస్

- వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సర్కార్ చలువతో తీరం అభివృద్ధి
- ఏపీ, తెలంగాణ రాష్ట్రాల నుంచి క్యూ కడుతున్న పర్యాటకులు
- బాపట్ల, చీరాల తీరప్రాంతంలో కుప్పలుతెప్పలుగా రిసార్ట్‌లు
- ప్రభుత్వానికి పెరిగిన పర్యాటక రాబడి
- రిసార్ట్‌ల వ్యాపారంలో పారిశ్రామికవేత్తలు, కార్పొరేట్ సంస్థలు
- భూముల ధరలకు రెక్కలు



సూర్యలంక తీరంలో హరితా రిసార్ట్

సాక్షి ప్రతినిధి, బాపట్ల: వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పర్యాటకాభివృద్ధికి పెద్దపీట వేసింది. జిల్లా పరిధిలోని చీరాల, బాపట్ల సముద్ర తీర ప్రాంతాల్లో హోటల్స్‌తో పాటు పార్కుల్ని ఇప్పటికే నిర్మించింది. తీరంలో అభివృద్ధిని విస్తృతం చేయాలన్న ఉద్దేశంతో రహదారుల్ని సైతం నిర్మిస్తోంది. పర్యాటకుల తాకిడి పెరగడంతో ఈ ప్రాంతంలో పారిశ్రామికవేత్తలు పెద్దఎత్తున హోటల్స్, రిసార్ట్‌లను నిర్మించారు. ఈ వ్యాపారం రోజురోజుకూ పెరుగుతోంది. దీంతో ఈ ప్రాంతంలో భూముల ధరలకు రెక్కలొచ్చాయి. వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అభివృద్ధి వల్లే ధరలు పెరిగాయని ఈ ప్రాంత ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

పెరిగిన సందర్శకులు

మన రాష్ట్రంతో పాటు తెలంగాణ నుంచి పర్యాటకుల తాకిడి పెరగడంతో బాపట్ల, చీరాల ప్రాంతాల్లోని తీరం వెంబడి రిసార్ట్‌లు ఇబ్బడిముబ్బడిగా వెలుస్తున్నాయి. రోజురోజుకూ డిమాండ్ పెరుగుతుండడంతో స్థానిక నేతలతో పాటు రెండు తెలుగు రాష్ట్రాల్లోని పారిశ్రామికవేత్తలు, సినిమా రంగానికి చెందిన వారు రిసార్ట్‌ల నిర్మాణం చేపట్టారు. ఇప్పటికే భూములు కొనుగోలు చేసి పెట్టుకోగా, కొందరు కొన్న భూముల్లో గెస్ట్‌హౌస్‌లు, రిసార్ట్‌లు నిర్మించారు. పలువురు పారిశ్రామికవేత్తలు తమ కంపెనీ పేర్ల మీద పెద్దఎత్తున భూములు కొని రిసార్ట్‌ల నిర్మాణానికి సిద్ధమయ్యారు. ఐటీసీ కూడా తీరంలో రిసార్ట్‌ను నిర్మించింది. మరిన్ని నిర్మాణాలకు సిద్ధమైంది. ఇదే తరహాలో పలు కార్పొరేట్ కంపెనీలు తీరంలో భూములు కొని రిసార్ట్‌ల నిర్మాణానికి సన్నద్ధమయ్యాయి. పలువురు ప్రజాప్రతినిధులు, సినిమా నటులు, దర్శకులు, నిర్మాతలు ఇప్పటికే భూములు కొనుగోలు చేశారు. వారిలో కొందరు రిసార్ట్‌లు, గెస్ట్‌హౌస్‌లు నిర్మించారు. మరికొందరు గెస్ట్‌హౌస్‌లతో పాటు అత్యాధునిక వసతులతో రిసార్ట్‌లు నిర్మించేందుకు సిద్ధంగా ఉన్నారు.



రామాపురం బీచ్‌లో రివేరా రిసార్ట్స్

'రియల్' బూమ్

తీర ప్రాంతానికి డిమాండ్ పెరగడంతో భూముల ధరలకు రెక్కలొచ్చాయి. ప్రధానంగా తీరం వెంబడి ధరలు మరింతగా పెరిగాయి. గతంలో ఎకరం రూ . 30 నుంచి 50 లక్షల లోపు ఉన్న భూములు ప్రస్తుతం ఎకరం రూ. 4 నుంచి 5 కోట్లు పైనే అమ్ముడు పోతున్నాయి. పర్యాటకాభివృద్ధి నేపథ్యంలోనే భూముల ధరలు ఇబ్బడిముబ్బడిగా పెరిగినట్లు తెలుస్తోంది.

తీరానికి అనుకూలతలు

రెండు తెలుగు రాష్ట్రాల వారికి జిల్లాలోని తీరప్రాంతం దగ్గరగా ఉండడం, ఇక్కడికి వచ్చేందుకు ఖర్చు తక్కువ కావడంతో పర్యాటకులు జిల్లాకు తరలివస్తున్నారు. సాధారణ రోజుల్లో పర్యాటకుల సంఖ్య సుమారు 50 వేలు ఉండగా, వారాంతంలో లక్షకు మించి ఉంటోంది.

పెరిగిన సినిమా షూటింగ్‌లు

జిల్లాలోని తీరంలో సినిమా షూటింగ్‌లు పెరిగాయి. ఇప్పటికే చాలా షూటింగ్‌లు చీరాల, బాపట్ల ప్రాంతాల్లో జరిగాయి. ఇటీవల రవితేజ నటించిన టైగర్ నాగేశ్వరరావు సినిమా షూటింగ్ మొత్తం ఇక్కడే జరిగింది. స్టూవర్ట్‌పురం నేపథ్యంలో తీసిన సినిమా ఇది. దీంతోపాటు పలు షూటింగ్‌లు ఇక్కడే జరుగుతున్నాయి.

రిసార్ట్‌లు హౌస్‌ఫుల్

సందర్శకుల తాకిడి పెరగడంతో బాపట్ల, చీరాల ప్రాంతాల్లోని తీరం వెంబడి ప్రైవేటు రిసార్ట్‌లు పెద్దఎత్తున వెలిశాయి. చిన్న వాటితో పాటు సీబ్రీజ్, రివేరా, ఫాంకోస్ట్, మూన్‌లైట్, వీ హోటల్స్ తదితర కార్పొరేట్ స్థాయి రిసార్ట్‌లతో పాటు పదుల సంఖ్యలో పెద్ద రిసార్ట్‌లు ఉన్నాయి. వీటిల్లో రోజుకు రూమ్ రెంట్ రూ.10వేల నుంచి రూ. 20 వేల వరకూ ఉంది. ఆన్‌లైన్ బుకింగ్స్‌తో ఇవి నిత్యం నిండిపోతున్నాయి. ఇక సాధారణ స్థాయిలో వందలాదిగా రిసార్టులు వెలిశాయి. వీటిల్లో రోజుకు రూము రూ.3 వేలకు పైనే రెంట్ ఉంది. చీరాల, బాపట్ల పట్టణాల్లోనూ ఇబ్బడిముబ్బడిగా హోటళ్లు వెలిశాయి. బీచ్ ఎఫెక్ట్‌తో అన్ని నిత్యం రద్దీగా ఉంటున్నాయి. బాపట్ల సూర్యలంకలో హరిత రిసార్ట్ తోపాటు అటవీశాఖ ఆధ్వర్యంలో ఎకో రిసార్ట్ ఉంది. ఇవన్నీ వంద శాతం నిండిపోతున్నాయి. గడిచిన నాలుగేళ్లలో రద్దీ 50 శాతానికి పైగా పెరిగిందని అధికారులు చెబుతున్నారు.

పర్యాటకుల తాకిడి



సూర్యలంక బీచ్‌లో పర్యాటకులు

జిల్లాలోని బాపట్ల సూర్యలంక, చీరాల రామాపురం, ఓడరేవు, పాండురంగాపురం బీచ్‌లను చూసేందుకు సందర్శకులు క్యూ కడుతున్నారు. గతంతో పోలిస్తే సముద్ర తీరం చూసేవారి సంఖ్య మరింతగా పెరిగింది. మన రాష్ట్రంతో పాటు తెలంగాణ రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల నుంచి నిత్యం సందర్శకులు ఇక్కడి బీచ్‌లకు తరలివస్తున్నారు. వారాంతంలో సందర్శకుల సంఖ్య భారీగా ఉంటోంది. ప్రధానంగా హైదరాబాద్ నగరంతో పాటు తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా పర్యాటకులు ఇక్కడి బీచ్‌లకు తరలివస్తున్నారు. విశాఖ, గోవా, చెన్నై లతో పోలిస్తే తెలంగాణ రాష్ట్రానికి బాపట్ల, చీరాల బీచ్‌లు మరింత దగ్గరగా ఉన్నాయి. రైల్వేతో పాటు ఇతర రవాణా సౌకర్యాలున్నాయి. సొంత వాహనాలే కాకుండా రైల్లో రావాలనుకునేవారికి మరింత అనుకూలం. దీంతో పర్యాలకుల సంఖ్యరోజురోజుకూ పెరుగుతోంది.

జగనన్న పాలనలో మేలుని చూసి ఓటు వేయండి

పర్చూరు వైఎస్సార్ సీపీ అసెంబ్లీ అభ్యర్థి యడం బాలాజీ



చిన్నారిని ఆప్యాయంగా ఎత్తుకున్న అసెంబ్లీ అభ్యర్థి యడం బాలాజీ

పర్చూరు (చినగంజాం): జగనన్న పాలనలో ప్రతి కుటుంబానికీ జరుగుతున్న మేలుని చూసి వైఎస్సార్ సీపీకి ఓటెయ్యాలని పర్చూరు వైఎస్సార్ సీపీ అసెంబ్లీ అభ్యర్థి యడం బాలాజీ కోరారు. మండలంలోని ఏటీ ఉప్పరపాలెం, కొత్తపాలెం, చెరుకూరు గ్రామాల్లో గురువారం రాత్రి నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన ఏదో ఒక పథకం ద్వారా ప్రతి కుటుంబం లబ్ధి పొందిందని తెలిపారు. లబ్ధి పొందిన వారంతా వైఎస్సార్ సీపీని తిరిగి గెలిపించేందుకు కృషి చేయాలని ఆయన కోరారు. బాపట్ల పార్లమెంటుకు పోటీ చేస్తున్న నందిగం సురేష్‌తో పాటు అసెంబ్లీకి పోటీ చేస్తున్న తనను ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని ఆయన కోరారు. ఎన్నికల ప్రచారంలో భభూగంగా ప్రధాన వీధుల్లో ప్రచార రథంపై పర్యటించారు. ప్రతి గడపగడపకు వెళ్లి ఆయా కుటుంబాలు సభ్యుల్ని ఆప్యాయంగా పలకరించారు. ఇంటిలోని చిన్నారుల్ని ఆప్యాయంగా ఎత్తుకుంటూ కుటుంబ సభ్యులతో మమేకమై ఆయన ఓట్లను అభ్యర్థించారు. గ్రామాల్లో పలువురికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మే 13 న జరిగే ఎన్నికలలో ఫ్యాన్ గుర్తుకు ఓటెయ్యాలని, రాష్ట్రంలో జరిగిన అభివృద్ధిని చూసి వైఎస్సార్‌సీపీ గెలిపించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో పలువురు ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కోలాహలంగా నామినేషన్లు



బాపట్ల వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేస్తున్న ఎమ్మెల్యే కోన రఘుపతి

బాపట్ల టౌన్: సార్వత్రిక ఎన్నికలకు గురువారం నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కాగా తొలిరోజు పలువురు దాఖలు చేశారు. బాపట్ల అసెంబ్లీ నియోజకవర్గానికి తొలి రోజు ఆరుగురు అభ్యర్థులు ఏడు నామినేషన్లు దాఖలు చేశారు. కోన రఘుపతి (వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ), కోన రమాదేవి (వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ), కటికల శివభాగ్యరావు (ఇండిపెండెంట్), దేవరకొండ రాజేశ్వరరావు (పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా), గుదె రాజేశ్వరరావు (బహుజన సమాజ్‌పార్టీ) రెండు సెట్లు దాఖలు చేశారు. దోనేపూడి శాలిని (ఇండిపెండెంట్) అభ్యర్థులుగా నామినేషన్లు దాఖలు చేశారు.

- బాపట్ల పార్లమెంట్ స్థానానికి కట్టెపోగు విజయ్‌కుమార్ (పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా), నల్లమల తిరుపతిరాజు (నవతరం పార్టీ) నామినేషన్లు దాఖలు చేశారు.
- పర్చూరు అసెంబ్లీ నియోజకవర్గానికి తుమ్మలూరి వెంకటరత్నం (బీఎస్పీ) నామినేషన్ దాఖలు చేశారు.
- చీరాల నియోజకవర్గంలో తొలి రోజు ఒక్క నామినేషన్ దాఖలు అయ్యింది. పోలిశెట్టి శ్రీనివాసరావు (స్వతంత్ర అభ్యర్థి) దాఖలు చేశారు.

బాపట్ల అసెంబ్లీకి వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా కోన రఘుపతి

సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్ విడుదల

జిల్లా ఎన్నికల అధికారి పి.రంజిత్ బాషా ప్రకటన

బాపట్ల: సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్‌ను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.రంజిత్ బాషా విడుదల చేశారు. నామినేషన్ ప్రక్రియను బాపట్ల పార్లమెంట్ రిటర్నింగ్ అధికారి కార్యాలయం నుంచి ఆయన గురువారం ప్రారంభించారు. అనంతరం ఎస్పీ వకుల్ జిందాల్‌తో కలిసి స్పందన సమావేశ మందిరంలో విలేకరులతో మాట్లాడారు. నామినేషన్ ప్రక్రియ ఈనెల 25 వరకు జరుగుతుందని తెలిపారు. 26న నామినేషన్ పత్రాల పరిశీలన, 29న ఉపసంహరణ ప్రక్రియతో పోటీలో ఉండే అభ్యర్థుల పేర్లు స్పష్టంగా తెలుస్తుందని చెప్పారు. మే 13వ తేదీన ఎన్నికలు జరుగుతాయని, జూన్ 4వ తేదీన ఓట్ల లెక్కింపు ప్రక్రియ నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేశామని తెలిపారు. బాపట్ల పార్లమెంట్ నియోజకవర్గం ఒకటి, ఆరు అసెంబ్లీ నియోజకవర్గాలకు నామినేషన్ ప్రక్రియ జరుగుతుందని పేర్కొన్నారు. ఉదయం 11 నుంచి సాయంత్రం మూడు గంటల వరకు అభ్యర్థులు ఎవరైనా వేసుకోవచ్చని సూచించారు. అభ్యర్థులు నామినేషన్‌తో పాటు వివరాలు, ధ్రువీకరణలు సమర్పించాలని చెప్పారు. అన్ని అసెంబ్లీ నియోజకవర్గాలలోని రిటర్నింగ్ అధికారి కార్యాలయాల వద్ద హెల్ప్ డెస్క్‌లు ఏర్పాటు చేశామని తెలిపారు.

దివ్యాంగులు, వృద్ధులకు ఇంటి దగ్గరే ఓటింగ్

దివ్యాంగులు, 85 సంవత్సరాల దాటిన వారిని గుర్తించి ఇంటిటికీ వెళ్లి దరఖాస్తులను పంపిణీ చేశామని కలెక్టర్ తెలిపారు. 22లోగా పూర్తి చేసిన దరఖాస్తులను ఆర్వోలకు అందిస్తే మే మూడో తేదీ నుంచి 10లోగా హోమ్ ఓటింగ్ నిర్వహించడానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. పోస్టల్ బ్యాలెట్ దరఖాస్తు చేసుకున్న వారికి రిటర్నింగ్ అధికారి వద్ద ఓటింగ్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నామని, ఇంటింటికీ ఓటర్ స్లిప్పులు పంపిణీ చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నామని వివరించారు. ఫ్లయింగ్ స్క్వాడ్స్, ఎక్స్‌పెండిచర్ టీమ్‌లు మొత్తం కలిపి జిల్లాలో 357 పనిచేస్తున్నాయని వివరించారు. జిల్లాలో 1,510 పోలింగ్ కేంద్రాలు ఉండగా, క్రిటికల్ పోలింగ్ కేంద్రాలలో వెబ్ కాస్టింగ్ నిఘా ఉంచుతామని పేర్కొన్నారు. ఎస్పీ వకుల్ జిందాల్ మాట్లాడుతూ సమస్యాత్మక గ్రామాలలో అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్నామని చెప్పారు. చెడు నడత కలిగిన వారు, పాత నేరస్తులు, రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చామని తెలిపారు. 793 మందితో పాటు చట్ట వ్యతిరేక కార్యకలాపాలలో పాల్గొనకుండా వివిధ రాజకీయ పార్టీలకు చెందిన 8,819 మందిని బైండోవర్ చేశామని వెల్లడించారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి సీహెచ్. సత్తిబాబు, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు సీతారామయ్య పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి పి.రంజిత్‌బాషా, ఎస్పీ వకుల్‌జిందాల్

'పాలేటి' పెత్తనం మాకొద్దు !

- పార్టీ నేతలు, బూత్ కన్వీనర్ల ఆక్రోశం
- చీరాల టీడీపీలో చీలికలు
- టీడీపీ అభ్యర్థి కొండయ్యకు వ్యతిరేకంగా ప్రత్యేక సమావేశం
- పార్టీలో తమకు అన్యాయం జరుగుతోందని ఆవేదన



చీరాల గోలి సదాశివ కల్యాణ మండపంలో పార్టీకి వ్యతిరేకంగా కమిటీ నాయకుల సమావేశం

చీరాల: ఎన్నికల వేళ చీరాల టీడీపీలో చీలికలు ఆ పార్టీని పెద్ద కుదుపునకు గురి చేసింది. అభ్యర్థి మద్దులూరి మాలకొండయ్యతో విభేదించి అసమ్మతి నేతలు మరీ ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసుకున్నారు. ఇప్పటికీ ముఖ్య నాయకులు కొందరు అసంతృప్తితో ఉండగా తాజాగా పార్టీ పట్టణ నాయకులు, బూత్ కమిటీ కన్వీనర్లు ఒక్కసారిగా పార్టీకి వ్యతిరేకంగా గళమెత్తారు. కొండయ్య పరిపక్వత లేని రాజకీయాల కారణంగానే తాము పార్టీకి వ్యతిరేకంగా ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశామని పేర్కొంటున్నారు. నియోజకవర్గ టీడీపీలో జరుగుతున్న నిర్లక్ష్య వైఖరిని అధిష్టానం దృష్టికి తీసుకెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. కొండయ్య తమను పట్టించుకోక పోవడం, కొత్తగా పార్టీలోకి వచ్చిన పాలేటి రామారావు పట్టణంలో పెత్తనం చెలాయిస్తూ తమను కాదని మరో వర్గాన్ని బూత్ కన్వీనర్లుగా కమిటీలు వేయడంతోనే ఈ వివాదం రాజుకుంది.

అసలు ఏమి జరిగిందంటే.. ?

పాలేటి రామారావు పార్టీలోకి చేరిన తరువాత అధిష్టానం టీడీపీ సీటును కొండయ్యకు కేటాయించింది. దీనికి ముందుగానే పాలేటి ఒక అడుగు ముందుకేసి సొంత ప్రయత్నం చేసి టీడీపీ తరపున ప్రచారం చేశారు. అయితే ఆ తర్వాత కొండయ్య, పాలేటి మధ్య చర్చలు జరిగాయి. పలు దఫాల చర్చల తరువాత పాలేటి, కొండయ్యకు సహకరించేందుకు అంగీకరించారు. అయితే, గత ఎన్నికల్లో పార్టీ గెలుపు మొత్తం తన భుజాన వేసుకున్నానని, ఈ సారికూడా నియోజకవర్గం బాధ్యతలు తమకి అప్పగిస్తే కొండయ్యను గెలిపిస్తానని పాలేటి అన్నట్లు సమాచారం. దీనికి అంగీకరించకపోవడంతో చీరాల రూరల్, వేటపాలెం మండలం నేరుగా చూసుకుంటే, పట్టణ బాధ్యతలు పాలేటి చేపట్టే విధంగా ఒప్పందం కుదిరింది. పాలేటి అప్పటికే నిర్ణయించిన బూత్ కన్వీనర్లు, కమిటీ సభ్యులను కాదని తన అనుకూల వర్గంతో కొత్త కమిటీలను నియమిస్తున్నారు.

పాలేటి కావాలో, మేము కావాలో తేల్చుకోండి?

విషయాన్ని తెలుసుకున్న పాత కమిటీ సభ్యులు కొండయ్య, పాలేటిలను విభేదించి బుధవారం రాత్రి గోలు సదాశివ కల్యాణ మండపంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసుకున్నారు. దీనికి పార్టీ పట్టణ మాజీ అధ్యక్షుడు డేటా నాగేశ్వరరావు అధ్యక్షత వహించారు. పాలేటిని తీవ్రంగా విమర్శించారు. పాత కమిటీల్ని కాకుండా తమకు అనుకూలంగా ఉన్న వారితో కమిటీలు వేయడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. పాలేటి రామారావు ముఖ్య అనుచరులు, నాయకులంతా వైఎస్సార్ సీపీలోని కరణం వెంకటేష్ వెనక ఉన్నారని, వారిని పాలేటి ఎందుకు తీసుకు రాలేక పోయారని ప్రశ్నించారు. చీరాల టీడీపీలో గూడుపుఠాణి రాజకీయం జరుగుతోందని, అందుకే తాము పార్టీకి వ్యతిరేకంగా పట్టణ పార్టీ బూత్ కమిటీ సమావేశం జరిపి నిరసన తెలుపుతున్నట్లు చెప్పారు. వారు పాలేటి కావాలో.. తాము కావాలో తేల్చుకోవాలని అభ్యర్థి కొండయ్యకి అల్టిమేటం ఇచ్చారు. ఇది ఎన్నికల వేళ టీడీపీకి ఇది భారీ ఎదురు దెబ్బగా చెప్పుకోవచ్చు. చీరాల టీడీపీలో మళ్లీ చీలికలు మొదలయ్యాయి.

'కూటమి' ప్రచారమంతా మాయ

- రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు
- సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రం సుభిక్షం
- సంక్షేమ పథకాలతో ప్రతి కుటుంబం లబ్ధి
- ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి బాపట్ల ఎంపీ, రేపల్లె అసెంబ్లీ వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించాలి
- వైఎస్సార్ సీపీ గెలుపుతోనే సంక్షేమ పథకాల అమలు



ప్రచార రథంపై ఎంపీ మోపిదేవి, ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ గణేష్,

నగరం: పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా అమలవుతున్న సంక్షేమ పథకాలు కొనసాగాలంటే వైఎస్సార్ సీపీని అఖండ మెజార్టీతో గెలిపించాలని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు కోరారు. మండలంలోని బొరమాదిగపల్లి, చల్లమ్మ అగ్రహారం, బెల్లంవారిపాలెం, ఏలేటిపాలెం, వెలమవారిపాలెం, చిరకాలవారిపాలెం, పమిడిమర్రు, సజ్జావారిపాలెం, ఉల్లిపాలెం గ్రామాలలో గురువారం జరిగిన ఎన్నికల ప్రచారంలో ఎంపీ మోపిదేవి పాల్గొని మాట్లాడారు.సీఎం వైఎస్. జగన్ మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రం సుభిక్షంగా ఉందని తెలిపారు. గ్రామ సచివాలయ వ్యవస్థతో ప్రజల ముంగిటకు పాలన అందించిన ఘనత ఆయనదేనని కొనియాడారు. నాడు-నేడు కార్యక్రమంతో ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ వైద్యశాలల రూపురేఖల్ని మార్చి మెరుగైన వసతులు కల్పించినట్లు తెలిపారు. సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా పరిపాలన సాగించిన ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డిని రెండోసారి గెలిపించాలని కోరారు.టీడీపీ కూటమి మరలా ప్రజలను అబద్ధపు హామీలతో మోసం చేసేందుకు సిద్ధమైందని విమర్శించారు. 2014లో కూటమిగా ఏర్పడి ఎన్నో హామీలిచ్చి అధికారంలో వచ్చి, తర్వాత ప్రజల్ని మోసం చేశారని గుర్తుచేశారు.సంక్షేమం, అభివృద్ధి కావాలంటే ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి రేపల్లె వైఎస్సార్ సీపీ అభ్యర్థి డాక్టర్ ఈవూరు గణేష్, బాపట్ల పార్లమెంట్ వైఎస్సార్ సీపీ అభ్యర్థి నందిగం సురేష్‌ను అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ ఈవూరి గణేష్ మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండి సేవలందిస్తానని తెలిపారు. ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు.ఎన్నికల ప్రచారానికి వెళ్లిన నాయకులకు ప్రజలు బ్రహ్మరథం పట్టారు. పూలతో స్వాగతం పలుకుతూ మహిళలు హారతులిచ్చారు. ప్రచారంలో భాగంగా నేతలు పలు గ్రామాలలోని దేవాలయాలు, చర్చిలు, మసీదులలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.కార్యక్రమంలో ఎంపీపీ చింతల శ్రీకృష్ణయ్య, నియోజకవర్గ పరిశీలకులు అడపా శేషు, బౌడా చైర్మన్ దేవినేని మల్లికార్జునరావు, వైఎస్సార్ సీపీ నాయకులు మోపిదేవి హరినాథబాబు, మోపిదేవి రాజీవ్, డాక్టర్ సృజన్, సర్పంచులు, నాయకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

భారీగా పోలీసుల బందోబస్తు ఏర్పాటు

ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసిన చీరాల ఆర్వో



చీరాల టౌన్: శాసనసభ, పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి గురువారం నోటిఫికేషన్‌ను చీరాల రిటర్నింగ్ అధికారి జి.సూర్యనారాయణరెడ్డి విడుదల చేశారు. ఒక్కో అభ్యర్థి నాలుగు సెట్ల నామినేషన్లు దాఖలు చేయవచ్చన్నారు. శాసనసభ్యుడి ఎన్నికల్లో పోటీ చేసే ఎస్సీ, ఎస్టీలు రూ.5 వేలు, ఇతర సామాజిక వర్గాలకు చెందిన వారు రూ.10 వేలు డిపాజిట్ చేయాలని సూచించారు. మొదటిరోజు స్వతంత్ర అభ్యర్థిగా పోలిశెట్టి శ్రీనివాసరావు నామినేషన్ పత్రాలను ఎన్నికల అధికారి సూర్యనారాయణరెడ్డికి అందించారు. ఈనెల 18 నుంచి 25 వరకు వివిధ రాజకీయ పార్టీలు, స్వతంత్ర అభ్యర్థుల నుంచి ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లు స్వీకరిస్తామని ఆయన చెప్పారు. 25వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు ముగుస్తుందన్నారు. 26న పరిశీలన, 29న ఉపసంహరణల ప్రక్రియ పూర్తి చేసిన అనంతరం అభ్యర్థులకు గుర్తులు కేటాయింపులు చేస్తామని ఆర్వో తెలిపారు. పట్టణ సీఐ శేషగిరిరావు, టూటౌన్ సీఐ సోమశేఖర్, నలుగురు ఎస్ఐలు, సివిల్, ఏఆర్ పోలీసులతో బందోస్తును పర్యవేక్షించారు.

ఆటో డ్రైవర్‌పై పోక్సో కేసు

బల్లికురవ: బాలికను మాయమాటలతో తీసుకెళ్లి లైంగిక దాడి చేసిన ఘటనపై ఆటోడ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు బల్లికురవ పోలీసు స్టేషన్ ఏఎస్ఐ సి.బాలకృష్ణ గురువారం తెలిపారు. మండలంలోని కూకట్లపల్లి ఎస్సీ కాలనీకి చెందిన జొన్నలగడ్డ అవినాష్ కూలీలను ఆటోలో వ్యవసాయ పనులకు వివిధ గ్రామాలకు తీసుకువెళ్తుంటాడు. ఈ క్రమంలో అదే కాలనీకి చెందిన బాలిక ఆటోలో పనులకు వస్తోంది. ఆమెకు మాయమాటలు చెప్పి ఈనెల 15న బయటకు తీసుకెళ్లాడు. మూడు రోజులైనా గ్రామానికి రాకపోవటంతో బాలిక తల్లిదండ్రులు ఆందోళనకు గురయ్యారు. గురువారం ఇంటికి వచ్చిన బాలిక తనపై అవినాష్ అత్యాచారం చేశాడని తల్లిదండ్రులకు వివరించటంతో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోక్సో చట్టం కింద కేసు నమోదుతో దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు ఏఎస్ఐ వివరించారు.

నవరత్నాలతో లబ్ధిదారుల జీవితాల్లో వెలుగులు



కార్యక్రమంలో మాట్లాడుతున్న కరణం వెంకటేష్



టీడీపీ నాయకులకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న వెంకటేష్

చీరాల అసెంబ్లీ అభ్యర్థి కరణం వెంకటేష్

వేటపాలెం: దేశంలో ఎక్కడా లేని విధంగా సంక్షేమ పథకాలను అమలు చేసిన ఏకైక సీఎం ఒక్క సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని చీరాల వైఎస్సార్ సీపీ అసెంబ్లీ అభ్యర్థి కరణం వెంకటేష్ పేర్కొన్నారు. గురువారం రాత్రి మండలం రామన్నపేట పంచాయతీ రావూరిపేటలో ఉప సర్పంచ్ దంతం వెంకట సుబ్బారావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దేవాంగుల ఆత్మీయ సమావేశంలో ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడారు. నవరత్నాల పథకాలతో జగనన్న లబ్ధిదారుల జీవితాల్లో వెలుగులు నింపారని తెలిపారు. అక్కచెల్లెమ్మలు, అవ్వాతాతలు, బడుగు, బలహీన వర్గాలను ఆర్థికంగా ఆదుకొని అండగా నిలిచారని చెప్పారు. ఇచ్చిన మాట తప్పకుండా అన్ని హామీలు నెరవేర్చిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని పేర్కొన్నారు. చీరాలను ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి, తాను అభివృద్ధి చేయడానికి అనివిధాలా శ్రమించామని తెలిపారు. రాష్ట్రంలో చీరాలను ఆదర్శంగా తీర్చిదిద్దామని పేర్కొన్నారు. రాబోయే ఎన్నికల్లో తనను ఎమ్మెల్యేగా గెలిపించి సీఎం జగన్‌కు బహుమతిగి ఇద్దామని తెలిపారు. మే13 జరిగే ఎన్నికల్లో ఒక ఓటు తనకు, ఎంపీ అభ్యర్థి నందిగం సురేష్‌కు మరొకటి వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు. అనంతరం టీడీపీ వార్డు మెంబర్ చౌటూరి లక్ష్మి, పలువురు నాయకులు వైఎస్సార్ సీపీలోకి చేరారు. వెంకటేష్ పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ చీమటా సాంబు, మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, సర్పంచి కుందేటి రమణ, పార్టీ మండల అధ్యక్షుడు బొడ్డు సుబ్బారావు, మాజీ సర్పంచ్ కట్టా గంగయ్య, ఆర్బీకే చైర్మన్ శ్రీనివాసరావు, సీతామహాలక్ష్మి, అక్కల నాగేశ్వరరావురెడ్డి, నర్మద, జిడుగు మస్తాన్ పాల్గొన్నారు.

ముస్లింల అభ్యున్నతికి జగనన్న కృషి



వైఎస్సార్ సీపీలో చేరిన చినగంజాం మసీదు పేట ముస్లిం కుటుంబాలు

- టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరిన 25 ముస్లిం కుటుంబాలు
- పార్టీలోకి ఆహ్వానించిన పర్చూరు అసెంబ్లీ అభ్యర్థి యడం బాలాజీ

చినగంజాం: రాష్ట్రంలో ముస్లింల అభ్యున్నతికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాటుపడ్డారని పర్చూరు వైఎస్సార్ సీపీ అసెంబ్లీ అభ్యర్థి యడం బాలాజీ పేర్కొన్నారు. మండలంలోని మసీదు పేటకు చెందిన 25 ముస్లిం కుటుంబాలు గురువారం టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరాయి. చీరాలలోని పార్టీ కార్యాలయంలో చినగంజాం మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు ఆసోది బ్రహ్మానందరెడ్డి ఆధ్వర్యంలో బాలాజీ వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానం పలికారు. పార్టీలో చేరిన వారిలో పఠాన్ హమానుల్లా ఖాన్, షేక్ అముల్లా, షేక్ హనీఫ్, షేక్ సత్తార్, షేక్ హన్సర్, షేక్ మస్తాన్ వలి, షేక్ మహబూబ్‌బాషా, షేక్ మాబు సుభాని, షేక్ షంషుద్దీన్, షేక్ బాజీ, షేక్ సిద్దిక్, షేక్ సుభాని, షేక్ మౌలాలి, షేక్ షాహుల్, షేక్ జానీబాషా, షేక్ కరీముల్లా, షేక్ మహ్మద్, షేక్ కరీం బాషా, షేక్ అయూబ్ ఖాన్, షేక్ ఖాసిం, షేక్ ఖాజా, షేక్ బాబు, షేక్ బుజీబా, షేక్ రియాజ్, షేక్ బాదుష్, షేక్ సునీల్, వార్డు సభ్యురాలు గేరా ఆషా, పల్లపోలు గోపి, మురళి ఉన్నారు. కార్యక్రమంలో అక్కల రామకృష్ణారెడ్డి, కోటిరెడ్డి, పోలిరెడ్డి, ఎస్. జయసింహారెడ్డి, హేమంత్‌కుమార్‌రెడ్డి, ఇసూబ్, సుభాని ఖాన్, షాకీర్ పాల్గొన్నారు.

పేదలకు అన్నం పెట్టిన దేవుడు జగనన్న

- అద్దంకి అసెంబ్లీ అభ్యర్థి పానెం చిన హనిమిరెడ్డి
- పరిటాలవారిపాలెంలో ఎన్నికల ప్రచారం



ప్రచారంలో పానెం చిన హనిమిరెడ్డికి శాలువా కప్పుతున్న మహిళ

సంతమాగులూరు (అద్దంకి రూరల్): దేశంలో ఏ ముఖ్యమంత్రి అందించని సంక్షేమాన్ని అందించిన సీఎం జగన్ మోహన్‌రెడ్డి వైపే ప్రజలంతా అన్నారని అద్దంకి వైఎస్సార్ సీపీ అసెంబ్లీ అభ్యర్థి పానెం చిన హనిమిరెడ్డి అన్నారు. గురువారం రాత్రి సంతమాగులూరు మండలంలోని పరిటాలవారిపాలెం గ్రామంలో ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా హనిమిరెడ్డి మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి పాలనకు, చంద్రబాబు పాలనకు వ్యత్యాసాన్ని గమనించాలని ప్రజల్ని కోరారు. ఐదేళ్ల నుంచి పేదలకు అన్నం పెట్టిన దేవుడు జగనన్న అన్నారు. ఎమ్మెల్యేగా గెలిచిన గొట్టిపాటి రవికుమార్ నియోజకవర్గంలోని సమస్యల్ని గాలికి వదిలేశారని విమర్శించారు. తనను ఒక్కసారి నమ్మి ఓటు వేసి చూడాలని కోరారు. వైఎస్సార్ సీపీకి ఓటు వేసి తనను గెలిపించిన ప్రతి ఓటరును, కార్యకర్తను గుండెల్లో పెట్టుకుని చూసుకుంటానని తెలిపారు. చంద్రబాబునాయుడు అవ్వాతాతలపై ఇప్పటికీ కక్ష పూరితంగా వ్యవహరిస్తున్నారన్నారు. జగనన్నకు రోజురోజుకూ పెరుగుతున్న ఆదరణ చూసి దాడులకు పాల్పడుతున్నారని ధ్వజమెత్తారు. ఎవరెన్ని అడ్డంకులు సృష్టించినా జగనన్న గెలుపును ఆపలేరని ధీమా వ్యక్తం చేశారు. నియోజకవర్గానికి కొత్తగా వచ్చిన తనకు, తన కుటుంబ సభ్యులను ప్రజలు ఎంతగానో ఆదరిస్తున్నారని తెలిపారు. మే 13న జరిగే ఎన్నికల్లో ఎంపీ అభ్యర్థిగా నందిగం సురేష్, అసెంబ్లీ అభ్యర్థిగా తనకు ఫ్యాన్ గుర్తుపై రెండుసార్లు బటన్‌నొక్కి ఆశీర్వదించాలని కోరారు. రెండు గ్రామాల్లోని ప్రజలు హనిమిరెడ్డికి బ్రహ్మరథం పట్టారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



హనిమిరెడ్డి సమక్షంలో పార్టీలో చేరిన బొమ్మనంపాడు నాయకులు

టీడీపీ నాయకులు వైఎస్సార్ సీపీలో చేరిక

మాటతప్పని మడమతిప్పని జగనన్న పాలనపై నమ్మకం పెంచుకుని నియోజకవర్గంలో రోజురోజుకూ వందల సంఖ్యలో టీడీపీ నాయకులు వైఎస్సార్ సీపీలో చేరుతున్నారని అసెంబ్లీ అభ్యర్థి పానెం చిన హనిమిరెడ్డి అన్నారు. గురువారం మండలంలోని కుంకుపాడు గ్రామానికి చెందిన ఎంపీటీసీ మాజీ సభ్యుడు అనపర్తి వర్ధన్‌రావు, అనపర్తి రత్నం, సంతోష్‌రావు, ప్రకాశం, సుదర్శన్‌తో పాటు 20 కుటుంబాలకు చెందిన అనుచరులు టీడీపీ వీడి వైఎస్సార్ సీపీలో చేరారు. బొమ్మనంపాడు గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ గోరంట్ల పద్మావతి శివాజీ , నీటి సంఘం మాజీ అధ్యక్షుడు గోరంట్ల శ్రీనివాసరావులు హనిమిరెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. వీరందరికీ హనిమిరెడ్డి పార్టీ కండువాలు కప్పి స్వాగతం పలికారు.

మైనార్టీల సంక్షేమమే సీఎం జగన్ ధ్యేయం



అమర్తలూరు ఎన్నికల ప్రచారంలో అశోక్‌బాబు

వేమూరు అసెంబ్లీ అభ్యర్థి వరికూటి అశోక్‌బాబు

అమర్తలూరు(వేమూరు): మైనార్టీల సంక్షేమ ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్ రెడ్డి పలు పథకాలు ప్రవేశపెట్టారని నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి వరికూటి అశోక్‌బాబు అన్నారు. అమర్తలూరులో శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వం సంక్షేమ పథకాల గురించి వివరించారు. ఆంధ్రప్రదేశ్‌కు మళ్లీ వైఎస్. జగన్‌మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రి చేయాలని ఆయన కోరారు. అనంతరం అమర్తలూరు మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సభలో మాట్లాడారు. ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలు ద్వారా ప్రతి కుటుంబానికీ లబ్ధి చేకూరిందని తెలిపారు. తెలుగు దేశం పార్టీ చెందిన నాయకులు, కార్యకర్తలు కూడా సంక్షేమ పథకాలు పొందారని పేర్కొన్నారు. మైనార్టీ నాయకుడు షేక్ ఇమాన్ హుస్సేన్ మాట్లాడుతూ మతతత్వ పార్టీ బీజేపీతో పొత్తు పెట్టుకున్న చంద్రబాబు మాటల్నినమ్మవద్దని తెలిపారు. మైనార్టీలంతా ముఖ్యమంత్రి వైఎస్. జగన్ మోహన్‌రెడ్డికి మళ్లీ ఓట్లు వేసి ముఖ్యమంత్రిని చేయాలని ఆయన కోరారు. వేమూరు నియోజకవర్గ అభ్యర్థి వరికూటి అశోక్‌బాబు, బాపట్ల పార్లమెంట్ అభ్యర్థి నందిగం సురేష్‌లను గెలించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ రాపర్ల నరేంద్ర, గ్రామ సర్పంచ్ దేవర కొండ రాము, జెడ్పీటీసీ సభ్యుడు మూల్పూరు లావణ్య, యలవర్తి సురేష్, అంబటి రామోహనరావు, బర్మా ప్రవీణ్, కొండముది భాస్కర్, కట్టుపల్లి రాంబాబు, పోతార్లంక సురేష్, కోప్షన్ మెంబరు అరమళ్ల మాణిక్యం, మోదుకూరి హరిబాబు, అజయ్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు విష్ణుమొలకల వెంకటేశ్వరరావు, బొల్లిముత ఏడుకొండలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ముస్లిం రిజర్వేషన్లపై కూటమి నోరు విప్పాలి



మస్తాన్‌వలి

పర్చూరు (చినగంజాం): ముస్లిం రిజర్వేషన్లపై కూటమి నోరు విప్పాలని రాష్ట్ర వక్ఫ్‌బోర్డు కార్యదర్శి గడ్డం మస్తాన్‌వలి గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ముస్లిం రిజర్వేషన్లు రద్దు చేసి తీరుతామని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారని, అమిత్‌షా మాటనే ఆయన పేర్కొన్నారన్నారు. ఏపీలోను అదే విధానం అని బీజేపీ నేతలు అంటున్నారని, చంద్రబాబు కూడా రిజర్వేషన్లు రద్దుకు అంగీకరించినట్లు ఆ పార్టీ నేతలు అంటున్నారని తెలిపారు. దీంతో ముస్లిం రిజర్వేషన్లపై రాష్ట్రంలో తీవ్రమైన చర్చ నడుస్తోందన్నారు. వైఎస్సార్ అధికారంలోకి రాగానే నాలుగు శాతం రిజర్వేషన్లు కల్పించారని, దాన్ని రద్దు చేస్తామని కిషన్‌రెడ్డి చెప్పడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. దీనిపై రాష్ట్రంలో ఉమ్మడి కూటమి నాయకులు దీనిపై నోరువిప్పకపోవడం దారుణమని ఖండించారు. కూటమి నాయకులు తక్షణమే స్పందించాలని మస్తాన్‌వలి కోరారు.

వైఎస్సార్ సీపీతోనే ముస్లింల సంక్షేమం

కర్నూలు ఎమ్మెల్యే ఆఫీజ్ ఖాన్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆఫీజ్ ఖాన్, వక్ఫ్‌బోర్డు చైర్మన్ ఖాదర్‌బాషా

బాపట్ల: ముస్లింల సంక్షేమం వైఎస్సార్ సీపీతోనే సాధ్యమని కర్నూలు ఎమ్మెల్యే ఆఫీజ్ ఖాన్ పేర్కొన్నారు. బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతికి మద్దతుగా గురువారం ముస్లిం పెద్దలతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. తొలుత ఎమ్మెల్యే కోన రఘుపతి నివాసంలో కలిసి ఆయనకు పూర్తి మద్దతు తెలిపారు.అనంతరం మార్కెట్ వద్ద షాదీఖానాలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆఫీజ్‌ఖాన్ మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ముస్లింల సంక్షేమానికి కృషి చేశారన్నారు. చంద్రబాబునాయుడు అన్యాయం చేశారని దుయ్యబట్టారు. ముస్లింల హక్కుల రక్షణకు జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుందామని తెలిపారు. బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి మాట్లాడుతూ మసీదుల అభివృద్ధికి చేసిన కృషిని ప్రతి ముస్లిం గుర్తుంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వక్ఫ్‌బోర్డు చైర్మన్ ఖాదర్‌బాషా, జోనల్ ఇన్‌చార్జి ఇమామ్‌హుస్సేన్, జిల్లా అధ్యక్షులు నజీర్‌అహ్మద్, గడ్డం మస్తాన్‌వలి, మున్సిపల్ ప్రతిపక్ష మాజీ నేత షేక్ సయ్యద్ పీర్, రహీమ్ జాని, ఆసిఫ్, ఆరీఫ్ పాల్గొన్నారు.

అనధికార మద్యం విక్రయాలపై ప్రత్యేక నిఘా

నోడల్ డెప్యూటీ కమిషనర్ హేమంత్ నాగరాజు



సిబ్బందితో మాట్లాడుతున్న హేమంత్ నాగరాజు

అద్దంకి రూరల్: ఎన్నికల సందర్భంగా అనధికార మద్యం అమ్మకాలు, అక్రమ నిల్వల గోడౌన్‌లపై ప్రత్యేక నిఘా ఉంచాలని నోడల్ డెప్యూటీ కమిషనర్ కె. హేమంత్ నాగరాజు ఎస్ఈబీ సిబ్బందిని ఆదేశించారు. స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఎం. రవి ప్రకాష్ ఆదేశాల మేరకు గురువారం స్థానిక ఎస్ఈబీ స్టేషన్‌ను ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ పాత ముద్దాయిలను బైండవర్ చేసి వారి నుంచి సమాచారాన్ని సేకరించాలని తెలిపారు. మద్యం ప్రభావం ఎన్నికల మీద పడకుండా ప్రశాంతంగా నిర్వహించేలా విధులు సమర్థంగా నిర్వహించాలని సూచించారు. ఎస్ఐ వి. సైమన్, సిబ్బంది పాల్గొన్నారు.

ఏసీబీకి చిక్కిన ఇద్దరు సీఆర్డీఏ ఉద్యోగులు

- భవన నిర్మాణ అనుమతులకు రూ.30వేలు లంచం డిమాండ్
- రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్న అధికారులు
- మరో ప్రైవేటు బిల్డింగ్ ప్లానర్‌పై కూడా కేసు నమోదు



ఏసీబీకి చిక్కిన చంద్రశేఖరరావు(ఎడమ), పక్కన ప్రైవేటు బిల్డింగ్ ప్లానర్ ఇమ్రాన్‌ఖాన్

తెనాలి రూరల్: ఏసీబీ వలకు ఇద్దరు సీఆర్డీఏ ఉద్యోగులు, మరో ప్రైవేట్ బిల్డింగ్ ప్లానర్ చిక్కారు. ఓ భవన నిర్మాణానికి అనుమతులిచ్చేందుకు రూ.30 వేలు లంచం తీసుకుంటూ రెడ్ హ్యాండెడ్‌గా దొరికిపోయారు. గుంటూరు ఏసీబీ అడిషనల్ ఎస్పీ మహేంద్ర మాతే వివరాల మేరకు.. చేబ్రోలు మండలం వడ్లమూడికి చెందిన ఓ వ్యక్తి జీ ప్లస్ టూ భవన నిర్మాణం కోసం తెనాలిలోని సీఆర్డీఏ జోనల్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నాడు. నిర్మాణ అనుమతుల కోసం కార్యాలయంలో టౌన్ ప్లానింగ్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న లీల చంద్రశేఖరరావు, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ రాజేంద్ర సాయినాథ్ అతనిని రూ.30 వేలు లంచం డిమాండ్ చేశారు. నగదును తెనాలిలోని ప్రైవేటు బిల్డింగ్ ప్లానర్ ఇమ్రాన్ ఖాన్ ద్వారా పంపాలని షరతు పెట్టారు. అనుమతులకు దరఖాస్తు చేసుకున్న సదరు వ్యక్తి, సమీప బంధువు రత్నబాబుతో కలిసి ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. వారు సూచించిన విధంగానే నగదును ఇమ్రాన్‌ఖాన్‌కు గురువారం అందజేయగా అతను తీసుకెళ్లి సీఆర్డీఏ కార్యాలయంలో ఉన్న చంద్రశేఖరరావు, రాజేంద్రసాయినాథ్‌కు ఇచ్చాడు. వెంటనే ఏసీబీ అధికారులు రంగంలోకి దిగి వీరిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఇద్దరు సీఆర్డీఏ ఉద్యోగులతో పాటు ప్రైవేటు బిల్డింగ్ ప్లానర్‌పైనా కేసు నమోదు చేసినట్లు ఏఎస్పీ తెలిపారు. దాడుల్లో ఏసీబీ డీఎస్పీలు సత్యానంద్, ప్రతాప్‌కుమార్, ఆరుగురు ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ గెలుపునకు ముదిరాజులు కృషి చేయాలి

ఆంధ్రప్రదేశ్ ముదిరాజుల కార్పొరేషన్ చైర్మన్ నారాయణ ముదిరాజ్



మాట్లాడుతున్న నారాయణ ముదిరాజ్

పిడుగురాళ్ల రూరల్ : వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ గెలుపుకు ముదిరాజులు కృషి చేయాలని ఆంధ్రప్రదేశ్ ముదిరాజుల కార్పొరేషన్ చైర్మన్ నారాయణ ముదిరాజ్ అన్నారు. మండలంలోని కామేపల్లి గ్రామంలో గురువారం ముదిరాజుల ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా బీసీలను గుర్తించి వారికి సముచిత స్థానం కల్పించింది ఏకైక వ్యక్తి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. ముదిరాజులకు కార్పొరేషన్ ఏర్పాటు చేసిన ఘనత సీఎం జగన్‌కు దక్కుతుందన్నారు. ఆర్థికంగా, రాజకీయంగా అభివృద్ధికి సీఎం జగన్ కృషి చేస్తున్నారన్నారు. ముదిరాజుల సామాజిక వర్గానికి ప్రాధాన్యత కల్పించి విడుదల రజినీకి మంత్రి పదవి ఇవ్వడంతోపాటు, బీసీ మెంబర్‌గా పదవి ఇచ్చారన్నారు. గురజాల నియోజకవర్గంలో ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి, నరసరావుపేట పార్లమెంట్ అభ్యర్థి అనిల్‌కుమార్ యాదవ్‌లను అత్యధిక మెజార్టీతో గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో ముదిరాజుల సోదరులు పాల్గొన్నారు.

ముగిసిన వసంత నవరాత్రోత్సవాలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గా మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానంలో నిర్వహిస్తున్న వసంత నవరాత్రోత్సవాలు గురువారంతో ముగిశాయి. ఉత్సవాల్లో భాగంగా ప్రతి నిత్యం అమ్మవారికి పుష్పార్చన నిర్వహించారు. చివరి రోజు అన్ని రకాల పుష్పాలతో అర్చన చేశారు. దేవస్థాన యాగశాలలో మహా పూర్ణాహుతితో ఉత్సవాలు లాంఛనంగా ముగిశాయి. అమ్మవారికి అర్చన నిర్వహించే పుష్పాలతో ఆలయ ఈవో కెఎస్.రామారావు దంపతులు, స్థానాచార్య శివప్రసాద్ శర్మ, ఏఈవో రమేష్‌బాబు, ఇతర అధికారులు ఊరేగింపుగా వేదిక వద్దకు చేరుకున్నారు. పుష్పార్చన వీక్షించేందుకు పెద్ద ఎత్తున భక్తులు ఇంద్రకీలాద్రికి తరలివచ్చారు. భక్తులకు పుష్పాలను పంపిణీ చేశారు. యాగశాలలో ఆలయ స్థానాచార్య శివప్రసాద్ శర్మ, వైదిక కమిటీ సభ్యులు యజ్ఞనారాయణ మూర్తి, రంగావజ్ఝుల శ్రీనివాసశాస్త్రి పర్యవేక్షణలో పూర్ణాహుతి నిర్వహించారు.

300 క్వింటాళ్ల బియ్యం పట్టివేత



సత్తెనపల్లి: మండల పరిధిలోని నందిగామ అడ్డరోడ్డు వద్ద 300 క్వింటాళ్ల బియ్యాన్ని సత్తెనపల్లి రూరల్ సీఐ ఎం.రాజేష్ కుమార్ నేతృత్వంలో పోలీసులు గురువారం రాత్రి పట్టుకున్నారు. బాపట్ల నుంచి గుజరాత్‌కు ఈ బియ్యాన్ని తరలిస్తున్నారు. అయితే బియ్యం నలుపు రంగులో ఉండడంతో ఇవి రేషన్ బియ్యమా? కాదా? అనేది తేలాల్సి ఉంది. ఒక్కో బ్యాగులో 30 కేజీలు చొప్పున వెయ్యి బ్యాగులు లారీలో ఉన్నాయని దీనిపై పౌర సరఫరాల శాఖ అధికారులకు లేఖ రాసినట్లు సీఐ రాజేష్ కుమార్ తెలిపారు. బియ్యం విషయమై డిప్యూటీ తహసీల్దార్ అరుణను సంప్రదించగా బియ్యాన్ని శాంపిల్స్ తీసి నిర్ధారణ నిమిత్తం ల్యాబ్‌కు పంపామన్నారు. నిర్ధారించిన తర్వాత రేషన్ బియ్యం అని తేలితే కేసు నమోదు చేయడం జరుగుతుందన్నారు.